# సిమెంట్ ధరలకు రెక్కలు?

**ఈ ఆర్థిక సంవత్సరం 4 శాతం వరకు విజృంభించనున్న రేట్లు**

**మార్కెట్‌లో 7.5 శాతం మేరకు పెరగనున్న డిమాండ్: క్రిసిల్ అంచనా**



న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) దేశీయ మార్కెట్‌లో సిమెంట్ ధరలు 2 నుంచి 4 శాతం (రూ.15-20) మేరకు పెరిగే వీలున్నట్టు ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ, విశ్లేషణ సంస్థ క్రిసిల్ ఓ తాజా రిపోర్టులో అంచనా వేసింది. అలాగే డిమాండ్ 6.5 శాతం నుంచి 7.5 శాతం వరకు పెరగవచ్చని కూడా అన్నది. ప్రధాన మౌలిక వసతుల కల్పనకు, గ్రామీణ హౌజింగ్ ప్రాజెక్టులకు ఈసారి బడ్జెట్‌లో 10 శాతం దాకా కేటాయింపులు పెరగడం, రాబోయే వర్షాకాలంలో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదు అవుతుందన్న అంచనాలు సిమెంట్ వినియోగాన్ని, పరిశ్రమను ఉత్సాహపరుస్తున్నాయని పేర్కొన్నది. వ్యవసాయం లాభసాటిగా మారితే గ్రామీణ ప్రాంతాల్లో ఇండ్ల నిర్మాణాలు ఊపందుకుంటాయని కూడా క్రిసిల్ ఇంటిలిజెన్స్ అసోసియేట్ డైరెక్టర్ సచిదానంద్ చౌబే చెప్తున్నారు. కాగా, గత ఆర్థిక సంవత్సరం (2024-25) సిమెంట్ ఇండస్ట్రీలో వృద్ధిరేటు 4.5-5.5 శాతంగానే ఉన్నది. అయితే లోక్‌సభ ఎన్నికలు, అంతకుముందు మూడు ఆర్థిక సంవత్సరాల్లో అధిక వృద్ధిరేట్లే ఇందుకు కారణమని చెప్తున్నారు.

**మౌలికమే దన్ను**

రోడ్ల నిర్మాణాలు ఈ ఆర్థిక సంవత్సరం పెద్ద ఎత్తున జరిగే వీలుండటం సిమెంట్ వినియోగపు అంచనాల్ని అమాంతం పెంచేస్తున్నాయని క్రిసిల్ అంటున్నది. రైల్వేలు, సాగునీటి ప్రాజెక్టులు, పట్టణ మౌలిక సదుపాయాల కల్పన కూడా జోరుగా జరుగవచ్చన్న అంచనాలున్నాయి. ఈ క్రమంలోనే సిమెంట్‌కు గిరాకీ బాగా పెరగవచ్చని క్రిసిల్ అంచనా వేస్తున్నది. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై), మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంఎన్‌ఆర్‌ఈజీఏ) వంటి పథకాలు సైతం సిమెంట్ ఇండస్ట్రీకి దన్నునిస్తున్నట్టు పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. మొత్తానికి కేంద్ర ప్రభుత్వ పథకాలు, గ్రామీణ ప్రాంతాల్లో డిమాండే ఈసారి సిమెంట్ పరిశ్రమ ఆదాయానికి కీలకంగా మారనున్నాయి.

**పట్టణ డిమాండ్ అంతంతే**

దేశంలోని అన్ని ప్రధాన నగరాలు, పట్టణాల్లో నిర్మాణ రంగం నిరాశాజనకంగా ఉండటం సిమెంట్ పరిశ్రమకు ఎదురుదెబ్బగానే విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. గృహ రుణాలపై వడ్డీరేట్లు ఆశించిన స్థాయిలో తగ్గక పోవడం కొనుగోలుదారులను నిరుత్సాహపరుస్తున్నదని చెప్తున్నారు. ఇప్పటికే పెరిగిన నిర్మాణ వ్యయం కూడా కస్టమర్లను వేచిచూసే ధోరణిలోకి నెడుతున్నదని, దీంతో ఇప్పటికే నిర్మించిన ఇండ్లు అమ్ముడుపోక, కొత్త ప్రాజెక్టులపై రియల్టర్లు పెద్దగా ఆసక్తి చూపట్లేదన్న వాదనలూ వినిపిస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ వంటి నగరాల్లో ఇండ్ల అమ్మకాలు పడిపోవడం, మార్కెట్‌లో స్తబ్ధత నెలకొనడం పరిశ్రమకు ప్రతికూలమని అభిప్రాయపడుతున్నారు. అయితే హైదరాబాద్‌సహా ప్రధాన నగరాల్లో రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు పుంజుకొంటే సిమెంట్ ధరలు ఇంకా పెరిగే వీలుందన్న అంచనాలూ ఉన్నాయి.

# లక్ష రూపాయలు దాటిన పుత్తడి

**మరో రూ.1,800 పెరిగిన తులం ధర**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: బంగారం ధరలు భగభగమండుతున్నాయి. తొలిసారిగా లక్ష రూపాయల మైలురాయిని అధిగమించి రికార్డు నెలకొల్పింది పుత్తడి. దేశీయ రాజధానిలో పది గ్రాముల బంగారం ధర రూ.1,800 ఎగబాకి లక్ష రూపాయల పైకి చేరుకున్నది. ప్రాంతీయ ఆభరణాల వర్తకులు, స్టాకిస్టులు ఎగబడి కొనుగోళ్లు జరపడంతోపాటు వచ్చేవారంలో అక్షయ తృతీయ, ప్రస్తుత పెళ్లిళ్ల సీజన్ కావడంతో డిమాండ్ అధికంగా ఉంటుందన్న అంచనాతో ధరలు భారీగా పెరుగుతున్నాయి. ట్రేడ్ వార్‌తో ప్రపంచ దేశాల ఆర్థికంపై అనిశ్చిత పరిస్థితులు నెలకొనడం కూడా ధరలు పెరగడానికి ప్రధాన కారణం. దీంతో ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పుత్తడి ధర చారిత్రక గరిష్ఠ స్థాయి రూ.1,01,600కి చేరుకున్నది. సోమవారం ఇది రూ.99,800గా ఉన్నది. గతేడాది డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు బంగారం ధర రూ.22,650 లేదా 29 శాతం ఎగబాకింది. మరోవైపు, వెండి ధరలు నిలకడగా రూ.98,500 వద్ద స్థిరంగా ఉన్నాయి. అలాగే హైదరాబాద్‌లో 24 క్యారెట్ తులం గోల్డ్ ధర రూ.3,000 ఎగబాకి రూ.1,01,350కి చేరుకున్నది. అంతకు ముందు ఇది రూ.98,350గా ఉన్నది. అలాగే 22 క్యారెట్ ధర రూ.2,750 అందుకొని రూ.92,900 పలికింది. కిలో వెండి రూ.1,11,000గా నమోదైంది.



**అక్షయ తృతీయకు డిమాండ్ అంతంతే**

రికార్డు స్థాయిలో దూసుకుపోయిన బంగారం ధరలతో సామాన్యుడితోపాటు సంపన్నవర్గాలు కొనుగోలు చేయడానికి జంకుతున్నారు. ఈనెల 30న అక్షయ తృతీయ సందర్భంగా కొనుగోళ్లు భారీగా తగ్గే అవకాశాలున్నాయని బులియన్ వర్తకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

**బంగారం ధరలు పెరగడానికి ప్రధాన కారణాలు**

- టారిఫ్‌ల విషయంలో అమెరికా ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకునే దిశగా చర్యలు తీసుకుంటుండటం
- వడ్డీరేట్ల తగ్గింపుపై ఫెడరల్ రిజర్వు చీఫ్ జెరోమ్ పోవెల్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య వివాదం నెలకొనడం
- చైనాతోపాటు ప్రపంచవ్యాప్తంగా కేంద్రబ్యాంకులు బంగారాన్ని పెద్ద మొత్తంలో కొనుగోలు చేయడం
- అమెరికా కరెన్సీ డాలర్ బలహీనపడటం

# ఆరో రోజూ లాభాల్లో సూచీలు

ముంబై, ఏప్రిల్ 22: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా ఆరో రోజూ లాభాల్లో ముగిశాయి. బ్యాంకింగ్, ఎఫ్‌ఎంసీజీ రంగ షేర్లకు లభించిన మద్దతుతోపాటు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా పెట్టుబడులు పెట్టడం సూచీల్లో జోష్ పెంచింది. ఇంట్రాడేలో 400 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి 187.09 పాయింట్లు అందుకొని 79,595.59 పాయింట్ల వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 41.70 పాయింట్లు ఎగబాకి 24,167.25 వద్ద స్థిరపడింది. భారీగా లాభపడ్డ సూచీలకు ఐటీ, ఎనర్జీ రంగ షేర్లు బ్రేక్‌లు వేశాయని, అయినప్పటికీ రియల్టీ, ఎఫ్‌ఎంసీజీ, బ్యాంకింగ్ రంగ సూచీలు ఇచ్చిన దన్నుతో లాభాల్లో ముగిశాయి. ఐటీసీ, హెచ్‌యూఎల్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఎస్బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్‌ల షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించగా..మరోవైపు ఇండస్‌ఇండ్ బ్యాంక్ 4.88 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు పవర్‌గ్రిడ్, భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్‌లు నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే రియల్టీ 2.40 శాతం లాభపడగా, ఎఫ్‌ఎంసీజీ 1.87 శాతం, కన్జ్యూమర్ డ్యూరబుల్ 1.43 శాతం, హెల్త్‌కేర్, బ్యాంకింగ్ రంగ సూచీలు లాభపడగా..టెక్నాలజీ, ఐటీ, పవర్, యుటిలిటీస్, టెలికం రంగ షేర్లు నష్టపోయాయి.

**హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రికార్డు**

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నది. మంగళవారం సంస్థ షేరు 2 శాతం లాభపడటంతో బ్యాంక్ మార్కెట్ విలువ రూ.15 లక్షల కోట్లు దాటింది. ఈ మైలురాయికి చేరుకున్న మూడో సంస్థ కూడా హెచ్‌డీఎఫ్‌సీ కావడం విశేషం. గడిచిన పదిహేను రోజుల్లో బ్యాంక్ షేరు 11 శాతం లాభపడటంతో మార్కెట్ క్యాప్ రూ.1,50,289.64 కోట్లు పెరిగి రూ.15,01,289.37 కోట్లుగా నమోదైంది.

# సత్తా చాటిన తెలంగాణ తేజాలు

- సాయి శివానీకి 11వ ర్యాంకు
- కానిస్టేబుల్ కుమారుడికి 68వ ర్యాంకు
- టాప్-10లో తెలంగాణకు దక్కని చోటు
- 100లో 13 మంది తెలుగు విద్యార్థులు
- తెలుగు రాష్ట్రాల నుంచి 78 మంది ఎంపిక
- 1,009 మంది ఫలితాలు విడుదల


సాయిశివాని


జయసింహారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ) : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) వెలువరించిన సివిల్స్-2024 తుది ఫలితాల్లో తెలంగాణకు ర్యాంకుల పంట పండింది. రాష్ట్రానికి చెందిన ఎట్టబోయిన సాయిశివాని 11వ ర్యాంకు సాధించింది. వరంగల్‌కు చెందిన రావుల జయసింహారెడ్డి 46వ ర్యాంకు, హైదరాబాద్‌కు చెందిన చింతకింది శ్రావణ్‌కుమార్‌రెడ్డి 62వ ర్యాంకు, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సాయి చైతన్యజాదవ్ 68వ ర్యాంకుతో అదరగొట్టారు. అయితే టాప్-10లో ఒక్కరు కూడా తెలంగాణకు చెందిన వారు లేరు. ఈ సారి మొత్తం గా 1,009 మంది ఫలితాలను యూపీఎస్సీ విడుదల చేయగా, క్యాటగిరీవారీగా తీసుకుంటే జనరల్ 335, ఈడబ్ల్యూఎస్ 109, ఓబీసీ 318, ఎస్సీ 160, ఎస్టీ 87 క్యాటగిరీ అభ్యర్థులున్నారు. ఈ సారి తెలంగాణ, ఏపీ నుంచి సివి ల్ సర్వీసెస్‌కు ఎంపికైన వారి సంఖ్య పెరిగింది. రెండు రాష్ట్రాల నుంచి 78 మంది ఎంపికైనట్టు లా ఎక్సలెన్స్ డైరెక్టర్ రాంబాబు పాలడుగు అంచనావేశారు. టాప్-100లో 13 మంది తెలుగు విద్యార్థులున్నట్టు విశ్లేషించారు.

**కోచింగ్ తీసుకోకుండా 11వ ర్యాంకు**

వరంగల్ శివనగర్‌కు చెందిన సాయిశివాని కోచింగ్ తీసుకోకుండానే, సొంత ప్రిపరేషన్‌లో, నిపుణుల మార్గదర్శనంలో ఏకంగా ఆలిండియా 11వ ర్యాంకు సాధించడం గమనార్హం.

**కానిస్టేబుల్ కొడుకు.. కలెక్టర్ కాబోతున్నడు**

నాన్న కానిస్టేబుల్. అమ్మ టీచర్. సివిల్స్ ప్రయత్నంలో ఐదు సార్లు విఫలమయ్యాడు. అయినా ఎక్కడా ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. క్రమపద్ధతిలో హార్డ్‌వర్క్‌చేసి సక్సెస్ సాధించాడు సాయిచైతన్య జాదవ్. తల్లిదండ్రులిచ్చిన ప్రోత్సాహం మరువలేనిదని, 68వ ర్యాంకు వస్తుందని ఊహించలేదని సాయిచైతన్య తెలిపాడు. హనుమకొండకు చెందిన రావుల జయసింహారెడ్డి స్టేట్ రెండో టాపర్(46వ ర్యాంక్)గా నిలిచాడు. నల్లమలకు చెందిన దళిత యువకుడు మొదటిసారే సత్తా చాటాడు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్ మండలం మన్ననూర్ వాసి సాయికిరణ్ 298వ ర్యాంక్ సాధించాడు. హనుమకొండలోని బాలసముద్రంకు చెందిన హరిప్రసాద్ 255వ ర్యాంక్ సాధించాడు.

| పేరు | ర్యాంకు |
|---|---|
| ఎట్టబోయిన సాయి శివానీ | 11 |
| రావుల జయసింహారెడ్డి | 46 |
| చింతకింది శ్రావణ్ కుమార్‌రెడ్డి | 62 |
| సాయిచైతన్య జాదవ్ | 68 |
| కొలిపాక శ్రీకృష్ణ సాయి | 190 |
| కౌశిక్ నర్సింహ | 225 |
| పోతరాజు హరిప్రసాద్ | 255 |
| సాయికిరణ్ | 298 |
| రాపర్తి ప్రీతి | 451 |
| బానోతు నాగరాజు నాయక్ | 697 |
| తొగరపు సూర్యతేజ | 799 |
| గోకమల్ల ఆంజనేయులు | 934 |
| రామటెంకి సుధాకర్ | 949 |

# సివిల్స్ ఫలితాల్లో నారీశక్తి

- యూపీకి చెందిన శక్తి దూబేకు ఫస్ట్ ర్యాంకు
- టాప్-5లో ముగ్గురు మహిళలు
- టాప్-20లో ఏకంగా 11 మంది
- ఫలితాలు ప్రకటించిన యూపీఎస్సీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించిన సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్- 2024 ఫలితాల్లో నారీశక్తి ప్రతిబింబించింది. టాప్-5లో ముగ్గురు యువతులు ఉండగా, టాప్-20లో ఏకంగా 11 మంది చోటు దక్కించుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు చెందిన శక్తి దూబేను మొదటి ర్యాంకు వరించిం ది. హర్షితా గోయల్‌కు రెండో ర్యాంకు, షా మార్గి చిరాగ్ నాలుగో ర్యాంకు దక్కించుకున్నారు. డోంగ్రే అర్చిత్ పరాగ్‌కు మూడో ర్యాంకు, ఆకాశ్ గార్గ్‌కు ఐదో ర్యాంకు లభించినట్టు యూపీఎస్సీ మంగళవారం ప్రకటించింది. ప్రథమ ర్యాంకర్ శక్తి దూబే యూపీలోని అలహాబాద్ యూనివర్సిటీ నుంచి బయోకెమిస్ట్రీలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ డిగ్రీ పొందారు. రెండవ ర్యాంకు సాధించిన హర్షితా గోయల్ ఎంఎస్ యూనివర్సిటీ ఆఫ్ బరోడా నుంచి బీకాం పట్టభద్రురాలు. మూడో ర్యాంకు సాధించిన డోంగ్రే అర్చిత్ పరాగ్ తమిళనాడులోని వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(విట్) నుంచి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో బీటెక్ పట్టభద్రుడు. నాలుగో ర్యాంకు సాధించిన షా మార్గి చిరాగ్ అహ్మదాబాద్‌లోని గుజరాత్ టెక్నలాజికల్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో బీఈ పట్టా పొందారు.

## భూ భారతి ద్వారా భూ సమస్యల పరిష్కారం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధి హన్మంతు

ముప్కాల్/మెండోరా, ఏప్రిల్ 21: భూ సమస్యల పరిష్కారానికి భూభారతి (ఆర్‌వోఆర్ చట్టం) ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. మంగళవారం భూ భారతిపై ముప్కాల్ మండల కేంద్రంలో రైతులకు అవగాహన కల్పించారు. భూ హక్కుల భద్రం, భూ సమస్యల సత్వర పరిష్కారం కోసం ఈ చట్టం ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, డైరెక్టర్ జైడి చంద రవి పాల్గొన్నారు. మెండోరా మండల కేంద్రంలో భూ భారతిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ హాజరై రైతులకు అవగాహన కల్పించారు. మార్కెట్, సొసైటీ కమిటీల చైర్మన్లు ముత్యంరెడ్డి, రాజారెడ్డి, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎంపీడీవో వనజ రైతులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

వినాయక్‌నగర్, ఏప్రిల్ 22: పోలీసు కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో నగరంలో పోలీసులు మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాలపల్లి, గాంధీ చౌక్, బోధన్ బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్ ఏరియాల్లో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 414మందిపై పలు రకాల కేసులు నమోదు చేశారు. సౌండ్ పొల్యూషన్ కలిగిన 5 వాహనలు, త్రిబుల్ రైడింగ్ చేసిన 7, మైనర్ డ్రైవింగ్‌పై 12, బ్లాక్ ఫిల్మ్ ఉన్న రెండు వాహనాలు, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే వారిపై కేసు నమోదు చేసి జైలుకు పంపించడం జరుగుతుందని సీఐ హెచ్చరించారు.

## చోరీ కేసులో ఇద్దరు అరెస్టు, రిమాండ్

నవీపేట, ఏప్రిల్ 22: మహిళ మెడలో నుంచి బంగారు మంగళసూత్రం చోరీ చేసిన ఇద్దరు నిందితులను స్థానిక పోలీసులు చాకచక్యంగా పట్టుకొని అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. చోరీకి సంబంధించిన వివరాలను ఎస్సై వినయ్ వివరించారు. ఈనెల 18న మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన ఓ మహిళ ధాన్యాన్ని ఆరబెట్టి ఓ చెట్టు కింద కూర్చుని సేద తీరుతున్నది. ఎడపల్లి మండలం ఏఆర్‌పీ క్యాంపునకు చెందిన సాయికుమార్, పవన్ కల్యాన్ బైక్‌పై వచ్చి ఆమె మెడలో నుంచి బంగారు మంగళసూత్రాన్ని లాక్కొని పారి పోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఇద్దరు నిందితులను పట్టుకొని వారి వద్ద నుంచి రెండు బంగారు పుస్తెలు, నాలుగు గుండ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బంగారు ధర బాగా పెరిగి పోవడంతో రాబోయే రోజుల్లో గొలుసు చోరీలు జరిగే అవకాశం ఉందని, మహిళలు, యువతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై కోరారు.

## ఇద్దరు నిందితులకు జీవితఖైదు

**హత్య కేసులో ఒకరికి, లైంగికదాడి కేసులో మరొకరి**

వినాయక్‌నగర్, ఏప్రిల్ 22: వేర్వేరు కేసుల్లో ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ నిజామాబాద్ నాల్గో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి టి.శ్రీనివాస్ మంగళవారం తీర్పు వెల్లడించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన జమాల్పూర్ చంద్రకళ తమతో తరచూ గొడవపడుతున్నదని పక్కింట్లో ఉండే సావిత్రి, తిర్మల్ ఇద్దరు కలిసి 8 మే, 2007న ఆమెపై దాడిచేశారు. గొడ్డలితో నరికి హత్యచేశారు. తిర్మల్ పదహారేండ్లుగా పరారీలో ఉన్నాడు. గత సంవత్సరం ఫిబ్రవరి 14న పోలీసులు పట్టుకున్నారు. అతడిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. తిర్మల్‌పై హత్యా నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు విధిస్తూ తీర్పు ఇచ్చారు. మోపాల్ మండలం న్యాల్‌కల్ గ్రామానికి చెందిన బత్తుల రాముకు అనే గ్రామానికి చెందిన ఓ వివాహితతో సాన్నిహిత్యం ఏర్పడింది. ఈ క్రమంలో 19 జూన్ 2017న రాము సిర్పూర్ గ్రామ శివారులోని సిద్దులగుట్టకు ఆమెను తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అతడిపై పోలీసులు కేసు నమోదు చేయగా.. నేరం రుజువు అయ్యింది. దీంతో జడ్జి ముద్దాయికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పు చెప్పారు.

## చదువులో వెనకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలి


సూచనలు చేస్తున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో

శక్కర్‌నగర్, ఏప్రిల్ 22: చదువులో వెనుకబడిన విద్యార్థులపై వచ్చే విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయులు దృష్టి సారించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని డిప్యూటీ డీఈవో కార్యాలయంలో బోధన్ అర్బన్, మండల తెలుగు, ఉర్దూ మీడియం ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుల సమీక్షా సమావేశానికి ఆయన హాజరై పలు సూచనలు చేశారు. వేసవి సెలవుల్లో హెచ్‌ఎంలు అందుబాటులో ఉండాలని బోధన్ ఎంఈవో నాగయ్య సూచించారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు రత్నాకర్, ఆరీఫొద్దీన్, స్వరూప, సీఆర్పీలు విజయ్, యూసుఫ్, విజయ రేఖ, బాబు, శివానంద్, దేవానంద్ ఉన్నారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్22: పట్టణంలోని యోగేశ్వర కాలనీకి చెందిన తోగటి భూమేశ్వర్ ఇంట్లో మంగళవారం ఉదయం దొంగలు హల్‌చల్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. తోగటి భూమేశ్వర్ ఇంటికి తాళం వేసి మామిడిపల్లిలోని వృద్ధాశ్రమానికి వెళ్లాడు. దొంగలు ఇంటి తాళం పగులగొట్టి లోనికి వెళ్లి బీరువా లాకర్‌లో ఉన్న ఐదు తులాల బంగారు ఆభరణాలు, 8 తులాల వెండి ఆభరణాలు చోరీ చేశారు. భూమేశ్వర్ ఇంటికి వచ్చేసరికి ఇంట్లోని ఆభరణాలు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

## ఉత్తమ పౌరులుగా ఎదగాలి

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 22: విద్యార్థులు బాగా చదువుతూ.. ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సూచించారు. మంగళవారం నిర్వహించిన నగరంలోని శంకర్ భవన్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## కేజీబీవీకి డ్యూయల్ మంచాల వితరణ


కార్యక్రమంలో పాల్గొన్న లయన్స్ క్లబ్ సభ్యులు

మాక్లూర్, ఏప్రిల్ 22: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో హాస్టల్ విద్యార్థినుల కోసం రూ.17 లక్షల విలువైన 174 బంక్ బెడ్స్‌ను రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అందజేసినట్లు క్లబ్ అధ్యక్షుడు బీరెల్లి విజయరావు, బాలకోటిరెడ్డి తెలిపారు. ముఖ్యఅతిథిగా రోటరీ జిల్లా 3150 గవర్నర్ శరత్ చౌదరి హాజరై మాట్లాడారు. కార్యక్రమానికి గౌరవ అతిథులుగా జిల్లా విద్యాశాఖాధికారి పి.అశోక్, నిర్మల్ జిల్లా ఎసీపీ ఉపేందర్‌రెడ్డి, మిషన్ భగీరథ సూపరింటెండెంట్ రాజేంద్రకుమార్, ప్రత్యేక అతిథులుగా అసిస్టెంట్ గవర్నర్ జ్ఞాన ప్రకాశ్, జితేంద్ర మలాని, సమగ్ర శిక్ష అధికారిణి భాగ్యలక్ష్మి, పొద్దుటూరి వినయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్‌వో స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## చేపల వలలో చిక్కుకొని ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్22: అంకాపూర్ శివారులో ఉన్న గుండ్ల చెరువులో చేపల వలలో చిక్కుకొని ముద్దంగుల రమేశ్(35) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఇందల్వాయి మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన రమేశ్ బతుకుదెరువు కోసం వచ్చి అంకాపూర్‌లో పశువుల కాపరిగా పని చేస్తున్నాడు. మంగళవారం గేదెలు మేపుతుండగా అవి చెరువులోకి వెళ్లి బయటికి రాలేకపోయాయి. వాటిని కాపాడే ప్రయత్నంలో చెరువులో దిగగా చేపల వల తట్టుకొని నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడి భార్య అపర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.



మాక్లూర్ మండలంలోని అడవిమామిడిపల్లిలో 1999-2000 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 ఏండ్ల తర్వాత ఒకే వేదికపై కలవడంతో ఆనందం వ్యక్తం చేశారు. పూర్వ గురువులను సన్మానించారు. - మాక్లూర్, ఏప్రిల్21

## 29న ఐక్యతా ర్యాలీ


సమావేశంలో మాట్లాడుతున్న రాజారాం యాదవ్

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్22: గ్రామాల్లో వీడీసీల ఆగడాలు, దౌర్జన్యాలను నిరసిస్తూ ఈనెల 29న ఆర్మూర్ పట్టణంలో బీసీ ఐక్యతా ర్యాలీ నిర్వహించనున్నట్లు బీసీ జన సభ అధ్యక్షుడు రాజారాం యాదవ్ తెలిపారు. పట్టణంలోని సిద్దార్థ డిగ్రీ కాలేజీలో మంగళవారం బీసీ కులాల ఐక్యత కోసం బీసీ కులాల జేఏసీ ప్రత్యేక కీలక సమావేశం నిర్వహించారు. బీసీ జనసభ అధ్యక్షుడు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కమిటీల ఆగడాలు, దౌర్జన్యాలు ఎక్కువయ్యాయని అన్నారు. అనంతరం అన్ని కులాల అధ్యక్షుల అంగీకారం మేరకు ఆర్మూర్ డివిజన్ బీసీ జేఏసీ అధ్యక్షుడిగా జర్నలిస్ట్ టీజేసీ చైర్మన్ నరసింహ చారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

## చిన్నారిపై వీధి కుక్కల దాడి

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్22: పట్టణంలోని 11వ వార్డులో జమ్మన్ జెట్టి కాలనీలో వీధి కుక్కలు స్వైర విహారం చేశాయి. ఈ కాలనీలో వీధి కుక్కల దాడిలో అనిల్ కుమార్, రాజమణిల ఐదేండ్ల కుమారుడు శ్రేయన్స్ తీవ్ర గాయాల పాలయ్యాడు. ఇంటి ఎదుట ఆడుకుంటున్న బాలుడుపై వీధి కుక్కలు దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన బాలుడిని కుటుంబ సభ్యులు నిజామాబాద్‌లోని జిల్లా దవాఖానకు తరలించారు. పట్టణంలో వీధి కుక్కలు బెడద ఎక్కువైందని పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వీధి కుక్కలు చిన్నారులపై గాయాలు చేస్తున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.

## పాఠశాల వార్షికోత్సవం..

రెంజల్, ఏప్రిల్ 22: కందకుర్తి జిల్లా పరిషత్ ఉర్దూ మీడియం పాఠశాలలో మంగళవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా నేటి సమాజంలో పుట్టగొడుల్లా వస్తున్న మొబైల్ యాప్‌లు జాగ్రతలపై విద్యార్థులు కళా రూపంలో ప్రదర్శించినట్లు హెచ్‌ఎం అబ్దుల్ ఖరీం తెలిపారు. ప్రదర్శించిన నాటికల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

## ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కాలేజీ విద్యార్థుల ప్రతిభ


గంగోత్రి శివాణి విజ్ఞశ్రీ

డిచ్‌పల్లి/ ధర్పల్లి/ జక్రాన్‌పల్లి/ రుద్రూర్/ చందూర్, ఏప్రిల్ 22: ధర్మారం(బీ) గురుకులంలో ఇంటర్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత తెలిపారు. సెకండియర్ ఎంపీసీలో టి.లక్కీ 992/1000, బైపీసీలో తోట కీర్తన 993/1000, ఫస్టియర్ ఎంపీసీలో పి.అనిత 464/470, బైపీసీలో 433/440 మార్పులు సాధించారని పేర్కొన్నారు. నడపల్లి గురుకులంలో సెకండియర్‌లో 83శాతం, ఫస్టియర్‌లో 73శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ నళిని తెలిపారు. ధర్పల్లి ఆదర్శ కాలేజీలో ఇంటర్ సెకండియర్‌లో 57శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ తెలిపారు. బైపీసీలో సంజన 983/1000, ఎంపీసీలో శివాని 958/1000, ఫస్టియర్ ఎంపీడీలో కె.మనస్వని 455/470 మార్కులు సాధించారని పేర్కొన్నారు. జక్రాన్‌పల్లి ఆదర్శ కళాశాలలో ఇంటర్ సెకండియర్ ఎంపీసీలో గంగోత్రి 965/1000, బైపీసీలో అను 982/1000, మొదటి సంవత్సరం ఎంపీసీలో రుచిత్ సాయి 449/470, బైపీసీలో భాను 398/440, సీఈసీలో లక్ష్మీప్రసన్న 443/500 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ సంధ్యారాణి తెలిపారు. రుద్రూర్ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ సెకండియర్ ఎంపీసీలో అక్షయ్ 941/1000, బైపీసీలో స్వాతి 938/1000, ఫస్టియర్ ఎంపీసీలో కల్పన 443/470, బైపీసీలో రక్షిత 433/440 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ చెన్నప్ప తెలిపారు. చందూర్‌కు చెందిన గూడూరు హన్సిక్ మొయినాబాద్‌లోని గురుకుల కళాశాలలో కంప్యూటర్ గ్రాఫిక్స్ యానిమేషన్ ఫస్టియర్ చదువుతూ 490/500 మార్కులు సాధించాడు. రుద్రూర్ గ్రామానికి చెందిన సాత్విక్ ఎంపీసీలో 992 మార్కులు సాధించి గ్రామస్తుల మన్ననలు పొందాడు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల కాలేజీలో చదివి అధిక మార్కులు సాధించడంతో గ్రామస్తులు అతడిని అభినందించారు.

**మోర్తాడ్‌లో 33 మంది ఉత్తీర్ణత**

మోర్తాడ్, ఏప్రిల్ 22: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 156 మంది ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు రాయగా 33 మంది ఉత్తీర్ణతను సాధించినట్లు ప్రిన్సిపాల్ గంగాధర్ తెలిపారు. మొదటి సంవత్సరంలో 107 మంది పరీక్షలు రాయగా 14 మంది ఉత్తీర్ణతను సాధించారని తెలిపారు. ఎంపీసీకి చెందిన మనస్విని 932 మార్కులు , బైపీసీలో విజయ్‌కాంత్ 902, హెచ్‌ఈసీలో పూజ 806 మార్కులతో కాలేజీ టాపర్లుగా నిలిచారు.

**నవీపేట మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ**



పి.భూసారిక ఎం.మనోజ

నవీపేట, ఏప్రిల్ 22: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో నవీపేట మోడల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో పి.భూసారిక 976, బైపీసీలో ఎం.మనోజ 911 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో హిమాబిందు 438/470, బైపీసీలో ఆర్.శ్రావ్య 425/500 మార్కులు సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 58 శాతం, ప్రథమ సంవత్సరంలో 59 శాతం ఫలితాలను సాధించినట్లు శ్రీనివాస్ పేర్కొన్నారు.

**మోకన్‌పల్లి కేజీబీవీలో..**

నవీపేట మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఇంటర్ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రత్యేకాధికారిణి కవిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 85 శాతం, ప్రథమ సంవత్సరంలో 69 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

**మాక్లూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..**


గంగామోహన్ యశస్విని జ్యాలంజుమ్

మాక్లూర్, ఏప్రిల్21: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎ.గంగామోహన్ 888/1000 సాధించి బైపీసీలో మండలంలో ప్రథమస్థానం, అదె యశస్వనీ 871/1000 సాధించి ఎంపీసీలో ద్వితీయ స్థానం, ఒకేషనల్‌లో సయ్యద్ ఉజ్మా అంజుమ్ 893/1000 ప్రథమ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ గంగారాం తెలిపారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో రూపిక 457/470, బైపీసీలో గణేశ్, 307/440, ఒకేషనల్‌లో ఆర్పియా మోహిన్ 425/500 మార్కులు సాధించినట్లు తెలిపారు. టాపర్లను అధ్యాపకులు అభినందించారు.

**మోడల్ కళాశాల విదార్థులు ..**

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్22: పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తాలో ఉన్న మోడల్ కళాశాల విదార్థులు ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు.